టెడ్డీ కిడ్స్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో చిన్నారులు, ఉపాధ్యాయులు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని టెడ్డీ కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. రకరకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగకు ముందే వేతనాలు చెల్లించాలి

నిజాంపేట్: దసరా పండుగకు ముందుగానే మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ జయ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండుగలకు ఎంతో ప్రాధన్యత ఉందని, తెలంగాణ గడ్డపై పండుగలు ముఖ్యంగా పేదలు, కార్మికులు చేసుకుంటారని అన్నారు. మున్సిపాలిటీలో పని చేసే పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులందరికీ ఈ నెల 26వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, నూనె డబ్బాలు, సబ్బులు, ఇతర పని ముట్లు ఇచ్చి, శానిటేషన్ విభాగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశి యాదయ్య, పాన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కుత్బుల్లాపూర్: చింతల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సూచన మేరకు నాయకులు అందజేశారు. గాంధీనగర్‌కు చెందిన ప్రభావతికి రూ.1.10 లక్షలు, గాజులరామారానికి చెందిన దూదేకుల ఖలీల్‌కు రూ. 2.10 లక్ష చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్, విజయ్‌రామిరెడ్డి, నాయకులు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

భూ భారతిపై పెరిగిన ఆశలు

పరిష్కారమైన దరఖాస్తులు 26,703



- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 4,773
- జిల్లాలో భూభారతిలో వచ్చిన దరఖాస్తులు 72,163
- తిరస్కరణకు గురైన దరఖాస్తుల సంఖ్య 30,607.
- ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టం
- భూ సమస్యలు గట్టెక్కుతుండటంతో రైతుల్లో ఆనందం

సాక్షి,మేడ్చల్ జిల్లా: భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ వివాదాల పరిష్కారానికి కాంగ్రెస్ సర్కారు 'ఆర్వోఆర్ చట్టం-2020 ధరణి' స్థానంలో నూతన రెవెన్యూ చట్టం 'భూ భారతి-2025'అమల్లోకి వచ్చిన తర్వాత భూ సమస్యల పరిష్కారం ఓ కొలిక్కి వస్తోంది. దీంతో గత ఐదారేళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్టు-బి భూములు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ తదితర అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతాయని రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే.. ఆర్డీవో.. అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే అవకాశాన్ని నూతన చట్టంలో కల్పించడం.. అందుకు ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- మ్యుటేషన్లు, వారసత్వ బదిలీ, నాలా కన్వర్షన్స్, సక్సెషన్, పీవోబీ, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణలు, కొత్త పాసు పుస్తకాల జారీ తదితరాలకు సంబంధించి జిల్లాలో 4,491 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వీటిలో కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,084 దరఖాస్తులు ఉండగా, మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,407 దరఖాస్తులు ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో 35 రకాల ఆప్షన్స్(ఐచ్ఛికా)లను పొందుపరిచినా.. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతో.. వీటన్నింటికి భూభారతి కొత్త చట్టంలో పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూ భారతిలో భాగంగా మొత్తం 72,163 దరఖాస్తులు అందగా,ఇందులో 30,607 దర ఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 31,194 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన అధికార యంత్రాంగం వాటిని పరిశీలించటంతోపాటు పలు దఫాలుగా విచారణ నిర్వహించి, ఇప్పటి వరకు 26,703 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న 4,491 దరఖాస్తులను పరిశీలించటంతోపాటు పలు దశల్లో విచారించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

మేడ్చల్‌పై ప్రత్యేక దృష్టి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిథ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండటంతో ....భూభారతి అమలుపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ భూములను చాలా మంది నకిలీ పత్రాలతో పట్టాలు చేసుకోవడం, పార్టు-బీ భూములు సైతం ' ఎక్కువగా ఉండటం తదితర కారణాల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది.

రైతుల ఆశలు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని భూసమస్యలపై ఎంపీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక ఫిర్యాదులు, దరఖాస్తులు అందాయి. దీనికి తోడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూసమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు లేక కొందరు, రికార్డుల్లో తారుమారు కావటంతో మరిందరు ఇబ్బందులు పడుతున్నారు. భూభారతితో ఇలాంటి సమస్యలు తొలగిపోతున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

వెయ్యి మందికి చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, మల్‌రెడ్డి రాంరెడ్డి, కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: బతుకమ్మ పండుగ సందర్భంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో నల్లమల్లీస్ ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెయ్యి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధ) ఆధ్వర్యంలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమానికి కార్మిక, గనుల శాఖమంత్రి డా. గడ్డం వివేక్ వెంకట స్వామి, తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ అధినేత పలబట్ల ఆనంద్ హాజరై చీరలు అందజేశారు. అనంతరం ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థికి రూ.5000 స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కె.సరిత, శ్రీదేవి, అరుణ, రాధిక, అనంతలక్ష్మి, స్రవంతి, శశికళ, పల్లా శశికళ, విజయ శ్రీ,, అనిత, పద్మ, సరిత, వీణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు నూతన స్తంభం ఏర్పాటు



విద్యుత్ అధికారులు పునరుద్ధరించిన స్తంభం

కుత్బుల్లాపూర్: కూలడానికి సిద్ధఃగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు అధికారులు మార్చారు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్ గ్రామంలో విద్యుత్ స్తంభం కింది భాగం శిథిలం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందిన స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ విషయమై సాక్షిలో ' ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం పాత స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో కారుణ్య స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు ఆధ్వర్యంలో ప్రధాని జన్మదినం సందర్భంగా దినసరి కూలీలకు శుక్రవారం నిత్యావసర సరుకులు, పండ్లు పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వ పథకాలు కూలీలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం లేబర్ అడ్డ కూలీలు వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు దాసి ఝాన్సీరాణి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కిరణ్, కమలాకర్, భవాని, సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో ఫ్రెషర్స్ డే



కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్‌డే శుక్రవారం ఘనంగా జరిగింది. జూనియర్లకు ఆహ్వానం పలుకుతూ సీనియర్ విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చదువుతో పాటు ఇతర అనుబంధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వక్తలు సూచించారు.

కళాశాలలో వసతులు కల్పిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

సుభాష్‌నగర్: మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా శుక్రవారం బహదూర్‌పల్లిలోని కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ కళాశాలను సందర్శించారు. కళాశాలలో విద్యార్థులు వాష్‌రూమ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆమె బాలికలకు వాష్‌రూమ్‌లు, తాగేందుకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఈఓ కిషన్, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమూన్ పాల్గొన్నారు.

చెత్త వేయొద్దంటూ..

సుభాష్‌నగర్:. సంజయ్ గాంధీనగర్‌లోని గాజుల రామారం షాపూర్ నగర్ ప్రధాన రోడ్డును ఆనుకొని స్థానికంగా ఉన్నవారు నిత్యం చెత్త వేస్తున్నారు. వేసిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తీసివేసి శుభ్రం చేయడం పరిపాటిగా మారింది. శుభ్రం చేసిన ప్రతిసారి స్థానికంగా ఉన్నవారికి ఇక్కడ చెత్త వేయొద్దు అంటూ చెప్పిన ఫలితం లేకుండా పోయింది. దీంతో విసుగు చెందిన పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించి సదరు స్థలాన్ని శుభ్రపరచి అందులో అందమైన ముగ్గులు వేశారు. ఇకనైనా చెత్తకు చెక్కుబడుతుందో వేచి చూడాల్సిందే.

